ఆక్రమణల తొలగింపునకు అడ్డంకులు

- నత్తనడకన రోడ్డు విస్తరణ పనులు
- రోడ్డు వెడల్పు తగ్గించాలంటూ ఒత్తిళ్లు

అల్లవరం: మండలంలో ప్రతిష్టాత్మంగా చేపట్టిన రోడ్డు విస్తరణ పనులకు ఆక్రమణలు అడ్డంకిగా మారాయి. అల్లవరం ప్రధాన రహదారి పొడవునా ఆర్అండ్బీ స్థలాన్ని ఆక్రమించుకుని ఇళ్లు, ప్రహరీలను నిర్మించుకున్నవారు ఆక్రమణల తొలగింపును అడ్డుకుంటున్నారు. దశాబ్ద కాలంగా ఆధునీకరణకు నోచుకోక అధ్వానంగా తయారైన ప్రధాన రహదారులను విస్తరించేందుకు ఎంపీ అనురాధ చొరవతో నిధులు మంజూరయ్యాయి. పేరూరు-గోడిలంక, బెండమూర్లంక, ఓడలరేవు, గుడ్డివానిచింత-సామంతకుర్రు ప్రధాన రహదారులను విస్తరించి వినియోగంలోకి తీసుకుని రావాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు.

కాంట్రాక్టర్ను నిలువరించి

సీఎస్ఆర్ నిధులు రూ.25 కోట్లతో పేరూరు వై.జంక్షన్ నుంచి గోడిలంక, బెండమూర్లంక నుంచి ఓడలరేవు వరకు రెండు పనులుగా విభజించి, తొలుత పేరూరు నుంచి గోడిలంక రోడ్డు విస్తరణ పనులను చేపట్టారు. అల్లవరం మసీదు సెంటర్ నుంచి హైస్కూల్ వరకు జరుగుతున్న సీసీ రోడ్డు పనులకు ఆక్రమణలు అడ్డంకిగా మారాయి. ఆర్అండ్బీ స్థలాన్ని ఆక్రమించుకున్నవారు రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. అల్లవరంలో ఆక్రమణలు తొలగించడానికి ప్రయత్నించిన కాంట్రాక్టర్ని నిలువరించి వారి ఇళ్లకు, ప్రహరీలకు ఎలాంటి నష్టం లేకుండా వెడల్పు తగ్గించాలని ఒత్తిడి చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అభివృద్ధికి బాటలు వేస్తుంటే ప్రతిపక్షాలకు చెందిన నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని, రోడ్డు విస్తరణ కోసం ఆర్అండ్బీ అధికారులు నిర్దేశించిన మార్కింగ్ ఆధారంగానే ఆక్రమణలు తొలగించాలని పలువురు కోరుతున్నారు. రెండు నెలలుగా గుడ్డివానిచింత-సామంతకుర్రు రోడ్డు విస్తరణ పనులు సాగుతున్నా నేటికీ విద్యుత్ స్తంభాలు తొలగించలేదు. ఆక్రమణల తొలగింపులో ఆర్అండ్బీ అధికారులు ద్వంద్వ వైఖరి ప్రదర్శించకుండా నిర్దేశించిన మార్కింగ్ ఆధారంగా ఆక్రమణలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఆర్అండ్బీ ఏఈ అంబేడ్కర్ని వివరణ కోరగా ఆక్రమణలు తొలగించే రోడ్డు విస్తరణ చేస్తామన్నారు. ఆర్అండ్బీ స్థలంలో నిర్మాణాలు ఉంటే ఉపేక్షించేది లేదన్నారు. విద్యుత్ స్తంభాలు తొలగించాల్సిన బాధ్యత కాంట్రాక్టర్దేనని స్పష్టం చేశారు.


అల్లవరంలో విస్తరణ కోసం మార్కింగ్ చేసిన ప్రహరీ


రోడ్డు విస్తరణలో తొలగించకుండా వదిలేసిన విద్యుత్ స్తంభాలు

వాడివేడిగా కౌన్సిల్ సమావేశం

- అధికారుల నిర్లక్ష్యంపై ధ్వజమెత్తిన సభ్యులు
- కనీస సమాచారం ఇవ్వడం లేదంటూ మండిపాటు

అమలాపురం టౌన్: 'మున్సిపల్ అధికారుల దృష్టికి ఏ సమస్య తీసుకెళ్లినా దానిపై సమాధారం ఇవ్వరు సరి కదా.. కనీసం క్షేత్ర స్థాయికి వెళ్లి పరిశీలించరు. అధికారులు ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలా..?' అంటూ పాలక, ప్రతిపక్ష కౌన్సిలర్లు మండిపడ్డారు. మున్సిపల్ చైర్పర్సన్ రెడ్డి సత్యానాగేంద్రమణి అధ్యక్షతన సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కౌన్సిల్ సమావేశం ఆద్యంతంపై వాడివేడిగా సాగింది. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, మున్సిపల్ వైస్ చైర్మన్లు తిక్కిరెడ్డి వెంకటేష్, రుద్రరాజు నానిరాజు సైతం అధికారుల తీరుపై ధ్వజమెత్తారు. వేయని రోడ్డును వేసినట్లు, బిల్లులు మంజూరు కావడం వంటి పరిణామాలపై ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు ఇంజినీర్లపై మండిపడ్డారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకురావద్దని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలోని మరుగుదొడ్లను కూడా పరిశుభ్రం చేయించలేని అధికారులను చూస్తుంటే సిగ్గేస్తుందని వైస్ చైర్మన్ నానిరాజు ఆవేదన వ్యక్తం చేశారు. కౌన్సిలర్లు మట్టపర్తి నాగేంద్ర మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పట్టణంలో మెయిన్ రోడ్ల చెంత ఉన్న మున్సిపల్ సామూహిక మరుగుదొడ్ల స్థలాలను కొందరు కబ్జా చేశారని, స్థలాల రికార్డులు బయటకు తీసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కౌన్సిలర్లు చిత్రపు రామకృష్ణ, బండారు గోవిందు, కట్టోజు సన్న య్యదాసు, గొవ్వాల రాజేష్, నాగాబత్తుల వెంకటేశ్వరరావు, చిట్టూరి పెదబాబు, దొమ్మేటి రాము, మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, డీఈఈ విజయదుర్గ తదితరులు పాల్గొన్నారు.


అధికారుల పని తీరుపై మండి పడుతున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

క్లుప్తంగా

కోనసీమ కవులకు సత్కారాలు


జాతీయ కవి సమ్మేళనం వేదికపై సత్కారాలు అందుకున్న కోనసీమ కవులు

అమలాపురం టౌన్: అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో ఏలూరులో ఆదివారం రాత్రి జాతీయ స్థాయిలో జరిగిన మాతృ భాషా దినోత్సవ కవి సమ్మేళనంలో కోనసీమకు చెందిన పలువురు కవులు తమ కవితా గానాలను వినిపించారు. శ్రీశ్రీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, కన్వీనర్ బీవీవీ సత్యనారాయణ, సహాయ కార్యదర్శి మాకే బాలార్జున, బుర్రకథ కళాకారుడు కడలి సత్యనారాయణ, రచయిత్రి కుంపట్ల సుభాషిణిలు మాతృ భాషపై రచించి వినిపించిన కవితలకు మంచి స్పందన వచ్చింది. ఈ సందర్భంగా కోనసీమ కవులను వేదికపై శ్రీశ్రీ కళా వేదిక జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ చైర్పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి తదితరుల చేతుల మీదుగా సత్కరించారు.

ఓటర్ల జాబితా పరిశీలన


నల్లా వీధిలో ఓటర్ల జాబితా పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నాయుడు

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీలో పోలింగ్ బూత్ల వారీగా జరుగుతున్న ఓటర్ల చేర్పులు, మార్పులు తదితర అంశాలను క్షేత్ర స్థాయిలో బూత్ లెవెల్ ఆఫీసర్లు(బీఎల్వోలు) సక్రమంగా నమోదు చేశారా...లేదా..? అనే విషయంపై కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు సోమవారం సాయంత్రం స్వయంగా తనిఖీ చేశారు. పట్టణంలోని 55, 56, 64 నెంబర్ల పోలింగ్ బూత్ల పరిధిలోని ఓటర్ల జాబితాలను పరిశీలించారు. స్థానిక నల్లా వీధి, వంటిద్దువీధి తదితర వీధుల్లో కమిషనర్ నాయుడు బీఎల్వోలతో పాటు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల నమోదు ప్రక్రియపై ఆరా తీశారు. అలాగే చనిపోయిన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగించారా లేదో చూశారు. బీఎల్వోలు అనుపమ లక్ష్మి, ఎండీఆర్ శ్రీనివాస్, వై.శ్రీనివాస్ తనిఖీల్లో పాల్గొన్నారు.

గ్రూప్-1 ర్యాంకర్కు అభినందనలు

ముమ్మిడివరం: ఇటీవల గ్రూప్-1 ఫలితాల్లో ఐదో ర్యాంకు సాధించిన అనాతవరం గ్రామానికి చెందిన మిమ్మితి భానుప్రకాష్రెడ్డిని ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కెరీర్ గైడెన్స్ కోచింగ్ సెంటర్లు, డా.బీఆర్ అంబేడ్కర్ స్టడీ సర్కిళ్లను ఏర్పాటు చేసి బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు, నిరుద్యోగులను ప్రోత్సహించాలని కోరారు.

నిరాధార ఆరోపణలు తగవు

యానాం: స్థానికంగా నిర్వహిస్తున్న పేకాట క్లబ్ స్థానిక ప్రజాప్రతినిధి ఆధ్వర్యంలో నడుస్తుందని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు నిరాధార ఆరోపణలు చేయడం తగదంటూ నాయకులు పెసల వెంకటేష్, హరిప్రసాద్ అన్నారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ రీక్రియేషన్ క్లబ్ల ఏర్పాటుకు వ్యతిరేకంగా ఎమ్మెల్యే అశోక్ పుదుచ్చేరి అసెంబ్లీ ఎదుట నిరాహార దీక్ష చేశారని గుర్తుచేశారు. రాయల్ రీక్రియేషన్ క్లబ్ కోర్టును ఆశ్రయించి అనుమతులు తెచ్చుకుంటే ప్రజాప్రతినిధికి దానితో సంబంధమేంటని ప్రశ్నించారు.

దస్తావేజు లేఖర్ల నిరసన

ముమ్మిడివరం: ప్రభుత్వం అమలు చేస్తున్న కార్డు 2.0 ప్రైమ్ రిజిస్ట్రేషన్ను సెప్టెంబరు నెల నుంచి ప్రారంభించడాన్ని నిరసిస్తూ సోమవారం స్థానిక సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం వద్ద ముమ్మిడివరం దస్తావేజు లేఖర్లు, స్టాంపు వెండర్లు సోమవారం నిరసన తెలిపారు. కార్డు 2.0 ప్రైమ్ రిజిస్ట్రేషన్ల వల్ల తాము ఉపాధి కోల్పోయే ప్రమాదముందన్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 30, 31న పెన్ డౌన్ కార్యక్రమం తలపెడతామన్నారు. నిరసనలో ఎల్లాప్రగడ జగన్నాథరావు, ప్రగడ వెంకట కృష్ణారావు, చవటపల్లి వెంకటేశ్వరరావు, ఎ.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ స్తంభం నుంచి జారిపడిన ప్రైవేటు లైన్మన్

అల్లవరం: బెండమూర్లంక పంచాయతీ పరిధిలో విద్యుత్ పనులు నిర్వహిస్తుండగా ఓడలరేవు గ్రామానికి చెందిన ప్రైవేటు లైన్మన్ నాగాబత్తుల శ్రీనివాస్ సోమవారం ప్రమాదవశాత్తూ స్తంభం పైనుంచి జారి పడిపోయాడు. ప్రమాదంలో శ్రీను వెన్నెముకకి బలమైన గాయం కావడంతో 108లో అమలాపురంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ జీజీహెచ్కు తరలించారు.

కొబ్బరి చెట్టు నుంచి జారిపడి..

ఓడలరేవులో కొబ్బరి చెట్టు ఎక్కుతున్న మోకా నరసింహారావు ప్రమాదవశాత్తూ జారి పడ్డాడు. ప్రమాదంలో గాయపడిన నరసింహారావును అమలాపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం కాకినాడ జీజీహెచ్కు తరలించారు.

అమ్మ భాష అమృతతుల్యం

నేడు తెలుగు భాషా దినోత్సవం

యానాం: 'మాతృభాష కంటే మధురమేది.. కన్నతల్లి కంటే ఘనమైనదింకేది..? తెలుగమయ్య నీవు తెలుగుబిడ్డ..' అన్నారు శ్రీనార్ల చిరంజీవి. తల్లి ఒడిలో శిశువు అభ్యసించే భాష మాతృభాష. అయితే ప్రస్తుత ఆధునిక సాంకేతిక యుగంతో ఆంగ్లంపై మోజుతో తెలుగుకు తెగులు పట్టిస్తున్నారని పలువురు సాహితీవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆంగ్లేయులు మన దేశంపై 200 ఏళ్ల పాటు ఆధిపత్యం వహించిన కారణంగా తెలుగు భాషపై ఆంగ్ల భాషా పదాల ప్రభావం ఎక్కువగా పడింది. తెలుగులోని వ్యాక్య నిర్మాణాన్ని కూడా ఆంగ్లం కొంతవరకూ ప్రభావితం చేసే పరిస్థితులొచ్చాయి.

తెలుగులోకి ఇంగ్లిష్ పదాలు

తెల్లవారింది మొదలు అన్నీ ఇంగ్లిష్ పదాలు మన పెదవుల నుంచి జాలువారుతున్నాయి. సోప్, టవల్, పేస్ట్, టంగ్ క్లీనర్, బాత్, రైలు, రోడ్డు, గ్లాస్, ప్లేట్, టికెట్, స్కేల్, బర్త్డే ఇలా అనేక పదాలు తెలుగులోకి చేరిపోయాయి. వాటికి సమాన అర్థాలు తెలుగులో ఉన్నా ఉపయోగించడం లేదు. ఇలా ఎన్నో పదాలు ఆంగ్ల భాషా ప్రభావానికి లోనవుతున్నాయి. తెలుగును విద్యాలయాల్లో పరభాషలా వివక్షతో చూడటం కూడా తెలుగు భాష అంతరించిపోతుందనే ఆందోళన ప్రారంభమైంది. ఐక్యరాజ్యసమితికి చెందిన యునెస్కో వెలువరించిన 'ది అట్లాస్ ఆఫ్ డేంజర్ అండ్ డిసప్పియరింగ్ లాంగ్వేజెస్' నివేదిక భారత్లో రెండో అతిపెద్ద తెలుగుభాష 2030 నాటికి అంతరించిపోయే ప్రమాదముందని పేర్కొంది.



ఎమ్మెల్యే పొన్నాడకు సత్కారం


ఎమ్మెల్యే పొన్నాడ సతీష్కుమార్ను సత్కరిస్తున్న ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ

తాళ్లరేవు: తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యునిగా నియమితులైన ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్కుమార్ను ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ సోమవారం ఆయన స్వగృహంలో కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నిరంతరం ప్రజా శ్రేయస్సుకు పాటు పడే ఎమ్మెల్యే పొన్నాడకు టీటీడీ పదవి ఇవ్వడం హర్షణీయమన్నారు. బడుగు, బలహీన వర్గాలకు ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. బీసీ సామాజిక వర్గానికి అత్యంత ప్రాధాన్యమిచ్చి రాజ్యసభకు పంపించిన ఘనత సీఎం జగన్మోహన్రెడ్డిదేనన్నారు. శెట్టిబలిజ సామాజిక వర్గానికి చెందిన తనకు ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ పదవి ఇచ్చారన్నారు. ఆయన వెంట పి.మల్లవరం ఉపసర్పంచ్ పంపన రామకృష్ణ, గంజా కాశీ విశ్వనాథ్ తదితరులున్నారు.

అమలాపురంలో ఏఎంసీ కార్యాలయం నిర్మించాలి

అమలాపురం రూరల్: అమలాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీకి నూతన భవనం నిర్మించాలని రాష్ట్ర మార్కెటింగ్ కమిషనర్ రాహుల్ పాండేను ఏఎంసీ చైర్మన్ దంగేటి డోలామణి కోరారు. ఈ మేరకు విజయవాడలో రాష్ట్ర మార్కెటింగ్ కమిషనర్ రాహుల్ పాండేను సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి ఏఎంసీ కార్యాలయ అవసరాన్ని వివరించారు.

అల్లవరం ఎస్ఐగా హరీష్కుమార్

అల్లవరం: అల్లవరం ఎస్ఐగా హరీష్కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు పోలీస్ సిబ్బంది సాదర స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. హరీష్కుమార్ గతంలో అమలాపురం రూరల్, టౌన్ పరిధిలో విధులు నిర్వర్తించారు. ఇప్పటివరకూ ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన శ్రీను నాయక్ ఆలమూరు ఎస్ఐగా బదిలీపై వెళ్లారు.


బాధ్యతలు స్వీకరిస్తున్న హరీష్కుమార్

ఆక్రమణలపై ఫిర్యాదు

అల్లవరం: పేరూరు నుంచి గోడిలంక వరకూ రోడ్డు విస్తరణలో భాగంగా గోడితిప్ప సెంటర్లోని ఆక్రమణలు తొలగించడంతో అక్కడుండే కొందరు చిరు వ్యాపారులు గోడిలంకకు వెళ్లే పంట కాలువని ఆక్రమిస్తున్నారని గోడిలంక గ్రామస్తులు సోమవారం స్పందనలో ఫిర్యాదు చేశారు. పంట కాలువ పక్కనే సిమెంట్ స్తంభాలతో షాపులు ఏర్పాటుచేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని తహసీల్దార్ సాంబశివప్రసాద్కు తెలిపారు. తక్షణమే అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించాలని కోరారు. రుద్రరాజు లక్ష్మీపతిరాజు, ఆర్.కృష్ణంరాజు, కాశీరాజు, దత్తుడు రాజు, బుజ్జిరాజు, అల్లూరి విశ్వనాథరాజు పాల్గొన్నారు.

ఘనంగా వీహెచ్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

ముమ్మిడివరం: వికలాంగుల హక్కుల పోరాట సమితి(వీహెచ్పీఎస్)ఆవిర్భావ దినోత్సవం సోమవారం ముమ్మిడివరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు నలమాటి లంకరాజు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ ఉద్యమ స్ఫూర్తితో హక్కుల సాధన కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ముమ్మిడివరపు రాజేష్, పెయ్యల బాలరాజు, సంసాని నాగరాజు, బందారు నాగేశ్వరరావు, చిక్కం ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు మాతృభాషపై అభిరుచిని కలిగించాలి

అమలాపురం రూరల్: బాల్యం నుంచి పిల్లలకు మాతృభాషపై అభిరుచిని కలిగించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, ఉపాధ్యాయులపై ఉందని ప్రముఖ కవి పొన్నపల్లి శ్రీరామారావు అన్నారు. స్థానిక ఎస్కేబీఆర్ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కవి పొన్నపల్లి శ్రీరామారావును కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్పీ కుమారశాస్త్రి సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సాహిత్య పురస్కార గ్రహీత డాక్టర్ ఎస్ఆర్ఎస్ కొల్లూరి, తెలుగు అధ్యాపకులు పెమ్మరాజు గోపాల్, డాక్టర్ కేటీ పద్మజ ప్రసంగించారు.

సీబీసీఐడీకి కనకారావు బదిలీ

యానాం: పుదుచ్చేరి పీఏపీలో విధులు నిర్వహిస్తున్న బడుగు కనకారావును పుదుచ్చేరిలోని సీబీసీఐడీ విభాగానికి బదిలీ చేస్తూ సోమవారం సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ సుభమ్ఘోష్ ఆదేశాలు జారీ చేశారు.

ఎంపీటీసీ దంపతులకు కలెక్టర్ సత్కారం

అమలాపురం రూరల్: కలెక్టరేట్లో స్పందన కార్యక్రమానికి వచ్చే అర్జీదారులకు చలివేంద్రం ఏర్పాటుచేస్తున్న చిందాడగరువు ఎంపీటీసీ మోటూరి కనకదుర్గ, వెంకటేశ్వరరావు దంపతులను కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సోమవారం సత్కరించారు.

విద్యార్థులకు ఆర్థిక సహాయం

తాళ్లరేవు: తండ్రిని కోల్పోయి ఫీజు కట్టలేని స్థితిలో ఉన్న ఇద్దరు విద్యార్థులకు సోమవారం స్థానిక లయన్స్క్లబ్ హాలులో జరిగిన కార్యక్రమంలో రూ.52 వేల ఆర్థిక సాయం చేశారు. తాడేపల్లి ప్రగతి బాల విద్యాలయంలో చదువుతున్న 8వ తరగతి విద్యార్థిని భాగవతి పూజిత, ఆరో తరగతి విద్యార్థి భాగవతి హేమ సుభాష్లకు దాట్ల లక్ష్మీకాంతమ్మ, దాట్ల శ్రీకాంత్ వర్మల సహకారంతో క్లబ్ ప్రతినిధులు వేలూరి సూరిబాబు చేతుల మీదుగా సాయం అందజేశారు.

మహాసభకు సమాయత్తం కావాలి

ఐ.పోలవరం: త్వరలో హైదరాబాద్లో జరగనున్న 'హలో మాదిగ.. చలో హైదరాబాద్' విశ్వరూప మహాసభకు అందరూ సమాయత్తం కావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్చార్జి వల్లూరి సత్తిబాబు మాదిగ పిలుపునిచ్చారు. మండలంలోని మురమళ్లలో సోమవారం జరిగిన ఎమ్మార్పీఎస్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాసభకు ఇంటికొకరు చొప్పున తరలి రావాలన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి యూ.విజయ్కిషోర్ బాబు, యార్లగడ్డ సత్తిబాబు, పలివెల నాగేంద్ర మాదిగ, ఆకుమర్తి మోహన్ మాదిగ, నవరపు భైరవమూర్తి తదితరులు పాల్గొన్నారు.